"పిరాకు మనియార్డరు వచ్చింది. పోస్టుమేన్ మళ్ళీ వస్తానన్నాడు. ఎక్కడికీ వెళ్ళకండి."

వారంరోజులుగా అతని ముందు మూగపిల్లలా కదిలి, కేవలం పరదాలు దించుకున్న ఘోషా చూపులతో సిగ్గుగా, రహస్యంగా, ఉత్సుకతతో పక్కల నించి, కిటికీల వెనకనించి వింతగా ప్రతి కదలికనీ పరిశీలించే నాగావళి ప్రాణం పోసుకున్న విగ్రహంలా మొదటిసారిగా అతని ఎదుట బిగదీసుకుపోయిన పెదాల్ని మెల్లగా కదిల్చి, ఆ వెంటనే తన ప్రమేయం లేకుండా ఆజ్ఞాపించగలిగిన తన కంఠాన్ని గుర్తుపట్టి సిగ్గుపడి అతని ఎదుట వుండలేక లోపలికి వెళ్ళిపోయింది.

సదానంద జోళ్ళు తొడుక్కోబోతున్నవాడల్లా మానేసి వెనక్కి తిరిగిచూస్తే నాగావళి కదిల్చిన గాలిఅలలకు ఎగిరిన దుమ్ము అటూ యిటూ కదుల్తోంది అక్కడ.

వెనక్కి తిరిగొచ్చి గదిలో కూర్చున్నాడు.

గదిలో ఏమీ తోచడంలేదు. ఒంటరితనమూ, నిశ్శబ్దమూ తప్ప తనకొరకు ఆ గదిలో కాలక్షేపానికి వీలుగా ఏమీ లేవు. కూనిరాగాలు తీసుకోడానికి క్రొత్త ప్రదేశంలోని బెరుకూ, స్వేచ్ఛగా కదలడానికి యింకా అలవాటుపడని మనుషులూ, వాళ్ళ పొడిపొడి పలకరింపులూ అతన్ని దిగ్బంధనం చేసేశాయి.

ఉద్యోగానికని వచ్చి వారంరోజు

అయ్యింది. నాగావళి తండ్రి రాఘవరావు గారు రమ్మంటే వచ్చాడు. ఆయన బహు తెలివైనవాడు. ఓ పెళ్ళిలో కలిసిన సదానంద తల్లిని ముందుచూపుతో పలకరించి, అబ్బాయిని తనదగ్గరకు పంపిస్తే ఉద్యోగం వేయిస్తాననీ, తన దగ్గరే వుండే ఏర్పాట్లు చేస్తాననీ మాట ఇచ్చాడు. ఆయన యింట్లో ఎదిగిన కూతురు వున్నసంగతి బంధువులందరికీ తెలుసు. అమ్మాయి బంగారపు బొమ్మ. బంగారపు బొమ్మ ఒంటిమీద బంగా రాన్ని పోలిస్తే ఎన్నితులాలు తూగు తుందా అన్న ఆలోచనతప్ప మరో ఆలోచనలేని మనుషుల్ని చూసేసరికి రాఘవరావుగారికి కంగారుపుట్టి ఇతరత్రా ప్రయత్నాలు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు.

అలాంటి ప్రయత్నమే సదానందను రప్పించుకుని ఉద్యోగం వేయిస్తాననడం. ఇందుకు సదానంద అంగీకరించాడని తెలిసిన బంధువులు అతన్ని గేలానికి తగులుకోబోతున్న చేపను చూసినట్టు చూసి జాలిపడ్డారు.

పెళ్ళి పందిట్లో చలాకీగా అటూ యిటూ కదిలి చిరుగాలుల్నీ, చిరునవ్వుల సౌరభాల్నీ వెల్లువని, అందరి చూపుల్నీ తనవైపు తిప్పుకోగలిగిన నాగావళిని చూచి 'ఇల్లాంటి అమ్మాయి తనకు యిల్లాలైతే బాగుండును' అనుకున్నాడు సదానంద. ఆ తర్వాత, ఆ అమ్మాయి తండ్రి రాఘవరావుగారు ఉద్యోగం వేయిస్తాను పంపించమంటే పరుగెత్తు కొచ్చాడు; చేతిలో డబ్బు లేకపోతే అందినతర్వాత మనియార్డరు చెయ్యమని యింట్లో చెప్పి వెంటనే బయలుదేరి వచ్చే శాడు.

వచ్చి వారంరోజు లయింది. రాఘవ రావుగారు ఉద్యోగ ప్రయత్నాలైతే చేస్తున్నారు. కోపరేటివ్ సబ్‌రిజిష్ట్రారు ఆయన. పలుకుబడి వున్నవాడే. పని రాళ్ళు వెనకేయాలన్నా చేతగాలేదు. రోగిష్టిభార్యా, మంచంలోంచి లేవలేని ముసలితల్లీ, చాలీచాలని చదువుకు తనమీదే ఆధారపడిన తమ్ముడికొడుకూ, అడపా దడపా నాగావళి అతని జీతాన్ని పంచు కుని, అకస్మాత్తుగా ఏ లాటరీయో తగులుతేనే తప్ప లేకపోతే తమకు మిగులులేని సంసారమే - అని నిరూపిం చారు.

ఈ వారంరోజులూ నాగావళి, చూపు లోనే తృప్తిపడుతూ వచ్చింది. ఇవ్వాళే పలకరించింది. అవి పలకరింపులా అని పించనే లేదు అతనికి. ఓ నిమిషం అలానే నిలుచుని, వయువలచి దాసం చేసినట్టు యింత పసరు చిరునవ్వును తనముందు పడేసి, కనురెప్పల పర దాల్ని ఎత్తిపట్టుకుని మరి కాసేపు ఆ వెనుక నర్తకిని నాట్యం చేయించి, కంఠంలో యింకాస్త శ్రద్ధతో శృతులు సరిచేసుకుని మంద్రస్థాయిలో "మని

యార్డరొచ్చింది మీకు. పోస్టుమేన్ మళ్ళీ వస్తానన్నాడు. కాసేపు కూచోండి" అని పలకరించి, కొద్దిసేపు అక్కడే నిలిచి, కృతజ్ఞత చెప్పకునే తన చూపుల్ని కూడా అందుకుని సిగ్గుతో అలవోకగా తలవంచుకుని, జారనివపైటను సర్దుకుని, అంతలోకే ఆమె చుట్టూ ఎగురుతున్న చూపుల-తుమ్మెదల రెక్కలకింద కదిలిన చిరుగాలులకు పులకరించి, చటుక్కున తన ఎదుటినించి తప్పుకుని పోయివుంటే ఎంత బావుండును! ఇంత పొయిటిక్‌గా ప్రవర్తిస్తే ప్రతిసంఘటననీ ఓ కావ్యంగా సృష్టించగలదు స్త్రీ: ఏమిటి జీవితాల్ని రసాత్మకం చెయ్యగలదు— అనుకున్నాడు అతను.

గదిలో ఏమీ తోచలేదు. ఈ ఏకాంతాన్ని తగలెయ్యడానికి సిగరెట్లు కూడా లేవు. పొద్దున్నే అయిపోయాయి. మూడు ఫర్లాంగుల దూరం వెళ్ళాలి. ఆ యింట్లో సాహిత్యాన్ని మోసే బీరువాలైనా ఎక్కడా కనిపించలేదు. ఇంచుమించు యిల్లంతా చూశాడు ఒక్క గది తప్ప. ఆ గదిని నాగావళి వాడుతోంది. ఏమున్నా వుంటే అందులో వుండాలి. పిలిచి అడగాలనిపించిందిగాని ఏమని పిలవాలి? పేరెట్టి పిలిచేంత చనువు ఏర్పడలేదు. ఉత్తరోత్త్రా అర్ధాంగలయ్యే అవకాశా ఉన్న ఆమెను తెలిసి తెలిసి 'ఏమండీ' అని ఎలా పిలవడం? అలాంటి దేమీ లేకుండా అతితెలివిగా 'చదువుకునే

పుస్తకాలేమైనా వున్నాయా?' అని అడగడానికి ఎప్పుడైనా ఆమె అతనిముందు కొస్తేగా.

చాలా ఇబ్బందిగా ముళ్ళమీద కూర్చున్నట్టు ఆ గదిలో కూచున్నాడు సదానంద. అరగంటసేపు అలానే కూర్చుని తన సహనాన్ని తనే పరీక్షించుకున్నాడు. ఇక చేతకాలేదు. వీధి వరండాలోకి వద్దామని రాబోతోంటే నట్టింట్లో కూని రాగం తీస్తున్న నాగావళి అతన్ని చూసి చటుక్కున ఆపేసింది. అల్లాంటి పరిస్థితికి బాధ్యుడయినందుకు కాస్తంత తత్తరపడి మళ్ళీ గదిలోకి తిరిగి వెళ్ళిపోయాడు.

రాగం బాగానే తీస్తోంది. పాటలు బాగా పాడే సామర్థ్యం వుందో, లేక ఉత్సాహంకొద్దీ కూనిరాగాలతోనే సరిపుచ్చుకుంటోందో మరి. మళ్ళీ కంఠం కదిపితే విందామని అతిశ్రద్ధగా చెవులొగ్గి దగ్గర్లోనే తచ్చాడుతూ నిలుచున్నాడుగాని

ఆమెఅక్కడున్న అలికిడే వినిపించలేదు.

పావుగంట సేపు గదిలోనే వుండి, బైటికొచ్చాడు. నాగావళినట్టింట్లోనేవుంది: తలగడ గలీబులకు పూలు కుట్టుకుంటోంది. అలికిడి విని తలెత్తి చూసింది.

"ఇంట్లో ఏమయినా పుస్తకాలున్నాయా?"

"ఏం పుస్తకాలండీ"

"ఏవైనా సరే. ఇంగ్లీషువయినా, తెలుగువయినా నవలలుంటే యివ్వండి. కాలక్షే..." చటుక్కున ఆపేసి తనలో తానే నవ్వుకున్నాడు. ఓ పొడిదగ్గు దగ్గి, కంఠం సవరించుకుని—

"...కాలక్షేపానికి ఏవయినా సరే. నాకు పుస్తకాలు చదివే పిచ్చి ఎక్కువే. నవలలు లేకపోయినా వారపత్రికలన్నా వుంటే యివ్వ." అన్నాడు.

నవ్వుతోంది ఆమె. ఏ చెరువు మీదనో, ఏ పున్నాగ చెట్టుకిందనో విడిపోయి తప్పించుకొని వచ్చిన చల్లటి పిల్లగాలి తెర ఒకటి గర్భగుడిలో కదలక అతినిశ్చలంగా వెలిగే ఆముదపు దీపంజ్యోతిని అరక్షణం అలా కాస్తంత కదిల్చినట్టుగా పెదాల్ని కదిపీ కదపనట్టు అతిసుతారంగా, మరీ నాజూకుగా కదిల్చే అతిపల్చని చిరునవ్వు నవ్వి "సాయంకాలం తెచ్చిపెడతాలెండి. ఇంట్లోఅయితే లేవు. ఓ స్నేహితురాల్ని అడిగి పట్టుకొస్తాను. దానిదగ్గర పెద్ద లైబ్రరీయే వుంది," అంది.

"సరేలెండి," అని చెప్పి మళ్ళీ గదిలోకే వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఏకాంతం అనిపించడం లేదు. ఇంతకు మునుపే గబగబా ఏరుకుని మనసులో దాచేసుకున్న నాగావళి రూపచిత్రాల్ని జ్ఞాపకాల భూతద్దాలకింద పెట్టి పెద్దవిగా పెంచుకుని చూస్తూకూర్చున్నాడు. అప్పుడప్పుడు అభిరుచుల రంగులుకూడా అద్ది, భవిష్యత్ తెరమీదకు ప్రొజెక్టు చేసి, దూరంగా నిలుచుని మరీ వివరంగా, స్పష్టంగా కనిపించే ఆ చిత్రాన్ని చూసి ఆనందం భరించలేక హృదయాన్ని మీటుకుని తనలో తానే పాట పాడుకున్నాడు.

ఎంత సేపు అయ్యిందో, బయటినుంచి పిలుపు వినిపిస్తే కూనిరాగం కట్టేసి, పోస్టుమేన్ వచ్చాడేమోనని కంగారుగా తలుపులు తీసుకుని బయటికి వచ్చాడు. ఎదురుగా నాగావళి! చేతిలో పుస్తకాల దొంతర – అంత ఎండలోనూ వెళ్ళొచ్చినట్టు ఎర్రగా కందిపోయిన ముఖంతో; చేతిలోబరువుకుఊపిరిబిగబెట్టిఒక్కసారిగ విదిల్చి మరీ ఎక్కువగా కదిల్చినవక్షాల్తో నొసటిమీంచి ముక్కుపక్కగా కదిలి, ఎత్తులేని చెక్కిలిమీదుగా కంగారుగా జారి, పెదవికింద పల్లంవేపుగాకొట్టుకొచ్చి, అగాధంలాంటి కంఠంలోతుల్లోకి దూకడానికి భయపడి అక్కడేఆగిపోయిన అందమైన చెమటబిందువుతో, స్నేహపూరితమైన చూపుల్తో నిలుచునివుంది.

"అరెరె... ఇంత ఎండలో వెళ్ళక పోతే ఏంపోయింది. ఎండ ఎలా మాడ్చేస్తోందో బయట. చెమటలుకూడా కారుతున్నాయి. ఏ సాయంకాలమో - వెళ్ళి తీసుకురావల్సింది," అన్నాడు. అన్నాడే గాని అతనిమాటలు అతనికే నచ్చలేదు; ఎబ్బెట్టుగా వున్నాయి. కృతజ్ఞత చెప్పుకునే మాట ఒక్కటీలేదు. కృతజ్ఞత చెప్పుకుందామనే మొదలెట్టాడు. ఏమిటేమిటో అనుకోనివన్నీ మాట్లాడేశాడు. కృతజ్ఞత అతనిదగ్గరే వుండిపోయింది. ఈ యిబ్బంది ఎందుకొచ్చిందో అతనికి తెలుసు. స్వేచ్ఛగా 'నువ్వు' అని ప్రయోగించలేని బెరుకుతనం. అందువల్ల మనసులోని భావం మాటల్లోకి రాలేదు. మరికొన్ని రోజులపాటు యీ యిబ్బంది తప్పదు. అంతవరకూ యిలా మాటల్ని తడుముకోవాల్సిందే.

పుస్తకాలు అందుకున్నాడు.

"ఇవి చదివేసిన తర్వాత యిచ్చేసి మరికొన్ని తేవచ్చులెండి" అంది.

"అలాగే; వీటితో వారంరోజుల పాటు కాలక్షేపం చేయొచ్చు."

నాగవళి యింట్లోకి వెళ్ళిపోయింది.

ఒకసారిపుస్తకాలన్నీ తిరిసి 'ఫరవాలేదు. మంచి సెలక్షనే' అనుకున్నాడు.

కాస్సేపటికి పోస్టుమేన్ వచ్చాడు. ఆ తర్వాత యిక అతనికి అవతలికి వెళ్ళాలనిపించలేదు. ఓ పుస్తకం ముందేసుకుని కూర్చుండిపోయాడు. ఆరోజిక మళ్ళీ నాగావళి పలుకరించలేదు.

మర్నాడు శెలవురోజు. రాఘవరావుగారు పొద్దున్నే అతన్ని వెంటేసుకుని తెలిసిన నలుగురిదగ్గరకీ తీసుకెళ్ళాడు. ఆరోజల్లా అలా బయట తిరగడంతోనే సరిపోయింది. ఆ తర్వాత రోజూ ఉదయం కాఫీ పట్టుకొచ్చినప్పుడూ, నీళ్ళు తోడినప్పుడూ, మధ్యాహ్నం విసనకర్ర పట్టుకొచ్చి యిచ్చినప్పుడూ, సాయంకాలం వీధి వరండాలోనూ నాగావళి పలకరించినా జ్ఞాపకాల్లో నిలుపుకోదగ్గ ప్రత్యేకత ఏమీలేని పొడిపొడి మాటలే అవడంవల్ల అతనుకూడా ఆట్టే పట్టించుకోలేదు. అయితే ఆ తర్వాతకూడా అలానే గడిచిన యింకో రెండు రోజుల్లోనూ అరడజను అనుభవాల్ని ఏరుకున్నాడు.

అందులో చివరిది—

నవల ఒకటి సాయంకాలంవరకూ

చేదిని విసుగెత్తి షికారుకని బయలుదేరాడు. మురిగ్గా, యిరుగ్గావున్న బాటల్నుంచి తప్పించుకుని వెళ్ళి ఓ పార్కులో కూర్చున్నాడు. అతనికి దగ్గర్లోనే విస్ఫులింగం లాంటి రంగులో ఎర్రటిపూలు [illegible] సన్నగా, పొడుగ్గా, ఏడుగువెట్టి [illegible] కాడమీద విరగాబడి [illegible] రించి పోతున్నాయి. మనుషులూ అంతే. ఎంత నాజూకుగా, ఎంత ఉన్నతంగా వుంటే అంతగా అతిచిన్న అనుభవానికి కూడా ప్రతిస్పందించి పోతుంది. ఈర్ష్యతో, కుత్సితంతో, పగతో, అసహనంతో నిండి, కరుకుగా, మోటుగా ఎదిగిన ఉన్నతంగా నిలవలేని మనసు బలమైన ఉద్రేకానికి తప్ప సున్నితమైన అనుభవానికి స్పందించలేదు. ఈ సత్యాన్ని తెలుసుకోలేని మనిషి పగతో, ద్వేషంతో, అసహనంతో మనసును నింపుకుని రసమయమైన యీ జగత్తును చూడలేక కళ్ళున్న గుడ్డివాడై పోతున్నాడు.

సదానందకి ఓ పువ్వు కోసుకోవాలనిపించింది. తోటమాలిని పిలిచి అడిగితే అతని ఆకారాన్ని చూసి "దాని కేం భాగ్యం కోసుకోండి" అన్నాడు. కాడతో పాటు ఒకటి కోసుకుని, మరికాసేపు అక్కడే కూర్చుని లేచి బయలుదేరాడు.

ఆకాశం కారికారి నల్లబడిపోయింది. అక్కడక్కడ యింకా ఆరిపోని నిప్పుల్లా మెరుస్తున్నాయి నక్షత్రాలు. సముద్రంమీంచి గాలి అలలు అలలుగా వీస్తోంది. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మెల్లగా నడుస్తున్నాడు. టౌను హాలు దగ్గర కార్లూ, ఖరీదైన మనుషులూ, దీపాలూ, దుమ్మూ — మంచి హడావిడిగా వుంది. దగ్గరకు వెళ్ళాడు. ఇంటర్‌స్టేట్ కల్చరల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం క్రింద వచ్చిన మద్రాసు సాంస్కృతిక బృందంవారు భరతనాట్య ప్రదర్శనలు యిస్తున్నారట.

భరతనాట్యం అనేసరికి సదానందం మనసు ఎగిరి గంతేసింది. అందులోనూ మద్రాసుబృందంవారి ప్రదర్శన. ఇటీవలి కాలంలోకూడా భారతదేశంలో లలితకళలు సంకరించకుండా స్వచ్ఛంగా సాంప్రదాయాన్ని పరిపోషించుకుంటూ ఎక్కడన్నా వున్నాయంటే అవి ఆంధ్రదేశానికి దిగువనే తప్ప పైన కాదని అతని అభిప్రాయం.

టిక్కెట్టు కొనుక్కుని లోపలకు వెళ్ళాడు. అప్పుడే ప్రదర్శన ప్రారంభమైంది. ఇద్దరమ్మాయిలు కలిసి అలారిప్పు ప్రదర్శిస్తున్నారు. పక్కవాయిద్యాలు చక్కగా కుదిరాయి. గాయకి కంఠంలో సంగతులు పలికిస్తోంది. నాట్యం చేస్తున్న యిద్దరూ రసాభినయం చేస్తున్నారు. వాళ్ళ పాదాలు లయబద్ధంగా పడుతున్నాయి. గజ్జెల చిరుమువ్వలు బృందశబ్దం చేస్తూ తుళ్ళుతున్నాయి. ఫిడేలుతీగలమీద కమాను

ఊయలలూగుతోంది. మృదంగంమీద వ్రేళ్ళు నృత్యం చేస్తున్నాయి. అన్ని నాదాలూ పాయలు పాయలుగా వచ్చి ఒకేతాడుగా అల్లుకుని ప్రేక్షకుల్ని బంధించేశాయి.

తెర వాలింది

చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది.

"ఎందుకలా చప్పట్లు చరుస్తారో వీళ్ళు. దాన్నింతా ఆ స్త్రీ తప్పులే. ముద్రలు పట్టడంతోనే సరిపోదు. తాళానికి తగ్గట్టు పాదాలు పడందే! ఇంతకన్నా చక్కగానే చేయగలన్నూ నేను" - ఎవరో విసుక్కుంటున్న శబ్దం వినిపించింది సదానందకి.

వెనక్కి తిరిగి చూశాడు. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ముఖం చిట్లించుకుని పక్కావిడతో మాట్లాడుతోంది. ఆమె కూడా నర్తకే అని ఆమె కళ్ళ అలంకరణే తెలుపుతోంది.

ఆ తర్వాత ప్రదర్శనలమీద కూడా ఆమె ఏదో కామెంట్ చేస్తూనేవుంది.

సదానందానికి నవ్వొచ్చింది. ఈ కళాకారులంతా యింతే. వొట్టి స్వార్థపరులు. నిజానికి కవులు, చిత్రకారులు, నర్తకులంత స్వార్థపరులు మరొకరు లేరు. పిసినిగొట్టువాడి స్వార్థం డబ్బు విషయంలో వుంటే కళాకారుడి స్వార్థం కీర్తి విషయంలో వుంటుంది. ఒక విధంగా పిసినిగొట్టువాడే నయం. పిసినిగొట్టువాడి స్వార్థం అతని కుటుంబానికి

సంబంధించివుంది. కాని కళాకారుడి స్వార్థం అతనికి ఒక్కడికే సంబంధించినది. అందుకే సదానంద కళను గౌరవించినంతగా కళాకారుడిని గౌరవించలేడు.

ప్రదర్శన పూర్తయ్యేసరికి చాలా రాత్రయ్యింది.

ఎప్పుడైనా చక్కని అనుభవం సదానందానికి లభిస్తే ఆ అనుభవాన్ని తలంచుకొంటూ కొద్దిసేపు వొంటరిగా నడవాలనిపిస్తుంది అతనికి. అనుభవాన్ని ఆ వెంటనే హృదయంలోంచి తోడుకుంటే ఆ అడుగున మిగిలిన స్వచ్ఛమైన పరిమళభరితమైన అనుభూతి మిగులుతుంది.

అంతరాత్రిలోనూ, విశాలమైన ఆకాశముకింద నిర్మానుష్యమైనబాటల్లో నడిచి యింటిని చేరుకున్నాడు. కాంపౌండు గోడకున్న బయటితలుపు వేసివుంది. ఈపాటికి అంతా గాఢనిద్రలో వుంటారు. తలుపుతట్టి పిలుద్దామనుకున్నాడు. కాని-

ఆ తలుపులే తెరుచుకున్నాయి. ఆ తెరిచిన తలుపుల వెనక నాగావళి!

అతనికి ఆశ్చర్యం వేసింది. ఇంత రాత్రివరకూ నిద్రపోకుండా తనగురించి ఎదురుచూస్తూ తనరాకను కనిపెట్టుకుని కూర్చున్నదన్నమాట. తనగురించి యింతగా పట్టించుకున్న హృదయం ఒకటి వుండడం ఎంత అదృష్టం! అతనికి చెప్పలేని ఆనందమైంది.

"రండి. అక్కడే వుండిపోయారేం" పక్కకు తప్పుకుంది. అతను లోపలకు వెళ్ళిపోయాడు. ఆమెకూడా తలుపేసుకుని లోపలకు వచ్చేసింది.

భోజనం వడ్డించి పిలుస్తే వెళ్ళాడు. ఆమె వడ్డించడం అదే మొదటిసారి. వాళ్ళమ్మను లేపబోతే బామ్మ కోప్పడ్డది. 'నువ్వెళ్ళి వడ్డించవే. దాన్ని లేపుతావెందుకు, నడుంనొప్పని పడుకుంటేనూ' అంది. ఆ మాటలు వినిపించాయి. ఆ తర్వాత అయిదునిమిషాలకు నాగవళి వచ్చి పిలిచింది.

తల వంచుకుని భోజనం చేస్తున్నాడు. తినాలనిలేదు. ఆకలి చచ్చిపోయింది. నాగావళి అవతల ద్వారబంధం దగ్గర నిలుచునివుంది. చూస్తోంది. అందుకని ఎలాగో భోంచేస్తున్నాడు.

"సినిమాకు వెళ్ళారా?"

"లేదు. డేన్సుప్రోగ్రాంకు వెళ్ళాను."

ఆమె ఓసారి కళ్లు ఎగరేసింది. "అభిరుచులు మంచివే కాని అలవాట్లే బావుండలేదు," అంది.

అర్థంకానట్టు చూశాడు అతను.

"ఆ అన్నం తినడానికి ఎంత యిబ్బంది పడుతున్నారో చూస్తూనే వున్నాను. ఇంతరాత్రి ఆకలేంవుంటుంది చెప్పండి. వేళకు భోజనం చెయ్యకపోతే ఆరోగ్యం పాడవదూ."

అతనేమీ మాట్లాడలేదు: ఈ కొద్ది రోజుల్లోనూ రాత్రిళ్లు యిలా ఆలస్యంగా రావడం యిదే మొదటిసారికాదు. సముద్రపువడ్డున కూర్చుంటే ఓరాత్రి పన్నెండయ్యింది. మరొకరోజు వెన్నెలవుందని అప్‌లేండ్స్‌లో పిచ్చిగా తిరిగి యింటికొచ్చేసరికి పదకొండు దాటింది. తను వొచ్చేసరికి కనిపించకపోయినా తనను కనిపెడుతూనే వున్నదన్నమాట!

ఎంత తినాలని ప్రయత్నించినా అంత రాత్రప్పుడు అన్నం సహించలేదు. మధ్యలోనే చేతులు కడుక్కుని లేచిపోయాడు.

"మరీ యింట్లోంచి కదలకుండా కూచోనక్కరలేదుగాని ఎక్కడికైనా వెళ్తేమటుకు యింటిని మర్చిపోకండి," అంది లేచొస్తున్న అతనితో.

బావుంది. చాలా సున్నితంగాశాసిస్తోందీమె. ఈ కొద్దిపాటి పరిచయంతోనూ తనను కట్టిపడేయాలని చూస్తోంది గాబోలు.

అతనికి నవ్వొచ్చింది. నవ్వుకుని

గదిలోకి వెళ్ళిపోయాడు. సిగరెట్టు కాల్చుకుందామని జేబులోంచి పెట్టెతియ్యబోతే పార్కులో కోసినపువ్వు కింద పడింది. అది తీసి మృదువైనదాని రేకల్తో చెక్కిలిమీద రాసుకుంటున్నాడు.

నాగావళి గదిలోకి వచ్చింది. "అన్నం సరిగా తిననేలేదు. అసలే వేసవికాలం — వేడి చేస్తుంది. ఇవైనా తినండి," అని ప్లేటుతో మామిడిపళ్ళముక్కలూ, గ్లాసుతో నీళ్లూ అక్కడపెట్టి, క్షణంసేపు అతని చేతిలోని పువ్వువైపు చూసి నవ్వుకుని వెళ్ళిపోయింది.

అదే ... ఆ చిరునవ్వును, అనురాగపు అరుణిమ పూసుకున్న పచ్చని నాజూకు పెదాలవెనక స్నేహపు ధవళిమను నింపుకున్న ఆ చిరునవ్వును; ఆమె తోరణంగా వేలాడగట్టిన మల్లెపూదండలోంచి జారిపడిన చిన్నరేఖలాంటి క్షణం చిరునవ్వును అలా ఏరుకుని దాచుకున్నాడు.

ఇలా తెరచిన కిటికీల్లోంచి తన జీవితంలోకి తొంగిచూస్తోన్న నాగవళి తన యింట్లోకి ఎప్పుడు అడుగుపెడుతుందో. ఆనాడు ఈ యింటి తాళాలు ఆమెకు యిచ్చెయ్యాలి. ఇంటిపెరట్లో పూలమొక్కల్ని నాటమనాలి. అనురాగాన్ని అడుగడుగునా జ్ఞప్తికితెచ్చే ఎర్రటిపూలనే పండించమనాలి. ఎరుపులో ఎన్నివన్నెలున్నాయో అన్నివన్నెలపూలూ అందులో వుండాలి. సిగ్గుతో కందిన చెక్కిలి

ఎరుపు, ఆకలి కదలిన మంటఎరుపు, తాంబూలం తడిపిన పెదాలఎరుపు, వెలుగు కరిగిన ఉదయపుఎరుపు, పసుపు చేరిన కాషాయఎరుపు, పసుపు చేరని మెజంటాఎరపు, వెన్నెల్లో తామరపూవు ఎరుపు, పండిన గోరింటాకుఎరపు, ముగ్గిన జామిపండుఎరుపు — యిలా ఎన్నిఎరుపు లున్నాయో అన్నిటినీ పండించమనాలి. ఆమెను మడుల్ని కట్టమని తను నీళ్ళు పోయాలి. రోజాపూలు కోయాలి. వాటితో యింటిని అలంకరించాలి.........

జీవితానికి కోటా కొట్టుకుని, భవిష్యత్తుఅద్దంలో తన రూపం చూసుకుని తననితానే గుర్తుపట్టలేకపోయాడు. రాత్రి చాలాసేపటివరకూ ఆ ఆకారాన్నే చూస్తూవుండిపోయాడు.

ఉదయం లేచేసరికి ఆలస్యమైంది. లేచి సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు.

ఇంట్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. రాఘవరావుగారి కంఠం అది.

"అమ్మాయి లేవాలేదేమో. ఉమాపతి రావుగారు పొద్దున్నే అతన్ని వచ్చి రమ్మన్నారు. వాళ్ళాఫీసులో ఓ ఖాళీ వుంది."

"ఆమధ్య మీరు చెప్పిన ఉద్యోగమేనా? అసలు ఆయనకు ఆ వుద్యోగం చేయడం ఇష్టమో కాదో కనుక్కోండి. ఆయనదంతా అదోరకం."

ఏమిటి! నాగావళి తన తత్వాన్ని కూడా తెలుసుకున్నట్టు మాట్లాడేస్తోంది. చాలా సన్నిహితంగా తనని పరిశీలిస్తోందన్నమాట. తన తత్వంకూడా ఆమెకు కావలసివచ్చింది. తన అభిరుచుల్నీ, యిష్టాయిష్టాల్నీ కూడా తనకన్నా ముందుగా ఆవిడే వూహించేస్తోంది. తనదంతా అదోరకమా; అంటే అర్థం ఆమె తరహా కాదనా. ఇంతకీ ఆమె తత్వం ఏమిటి? ఆమె అభిరుచులు ఏమిటి? ఏమాత్రం బయటపడదేం. ఎంత గుంభనం! సాహిత్యంలో ప్రవేశముందా? సంగీతం వచ్చా? పాడే వాళ్ళల్లో బహుతక్కువమందీ, నాట్యం చేసే వాళ్ళల్లో బహు ఎక్కువమందీ అందంగా వుంటారట. ఇంత అందమైన అమ్మాయికి నాట్యం రాకుండా వుంటుందా......

నాగావళి వచ్చింది. అతని గది కిటికీ ముందు సందివర్ధనం చెట్టుకిందనుంచి సిగరెట్టుపొగ పాయలుపాయలుగా గాలిలోకి ఎగరడం చూసి అతను లేచాడని తెలుసుకుని తలుపులు తోస్తూ "లేచారా? నాన్నగారు అడిగారు మిమ్మల్ని. ఎవరినో కలుసుకోవాలట. వేగంగా తెమలమంటున్నారు," అంది.

కొద్దిగా తెరచిన తలుపు రెక్కల సందులోంచి కనిపిస్తోంది ఆమె. బిగువు సడలి, చెవులమీదకు జారి, చుట్టూ ఆవరించిన నల్లటి జుత్తులో మరీ తెల్లగా సందివర్ధన పూవులా వుంది ఆమె ముఖం. ఆకులమీద వాలి, అవి కదలినప్పుడు పక్కలకు చెదిరి అడుగున పూసిన పుష్పం చెక్కిలిమీద ముద్దిడుతున్న ఉదయారుణ కిరణంలా ఆమె నొసటి కుంకుమబొట్టు తలుపు ఖాళీలో దాగుడుమూత లాడుతూ మెరుస్తోంది. రెక్కల్ని ఆడించి శక్తిని పుంజుకుని గాలిలో తేలిపోయే గండుతుమ్మెదల్లా నల్లటి కనురెప్పల్ని టపటపా కొట్టుకుని ఎగిరిన చూపులు తలుపుమధ్య ఖాళీ యిరుకు సందులోంచి స్వేచ్ఛగా రాలేక పోతున్నాయి. మంచుపడి రేకులమీదుగా జారి, తెగి కిందపడిపోలేక అంటిపెట్టుకుని వేలాడుతోన్న సాగిన మంచుబిందువులా వుంది ముక్కు.

అలా ఆ సన్నని తలుపు సందులోంచి కనిపించీ కనిపించనట్టు నిలుచున్న నాగావళి మరీ మనోహరంగా వుంది. లేచొచ్చి తలుపులు బోర్లా తెరిచి

లోపలికి రమ్మని పిలుద్దామనికూడా అనుకోలేదు అతను. తెరిచేస్తే యింత అందం అప్పుడు వుండదు. ఎంత నిర్మలంగా వున్నా మేఘాలు లేకపోతే ఆకాశానికి అందంలేదు. మేఘాలు ఆకాశాన్ని కప్పి, అక్కడక్కడ కొద్దికొద్దిగా వొదిలేసి వున్నప్పుడే అందం. ఎంత అందగాడయినా, ఏ కొబ్బరిచెట్ల ఆకుల చాటునో దాగుడుమూత లాడుతున్నప్పుడే చంద్రుడి అందం రాణిస్తుంది. తామరాకుల్ని కప్పుకుని, అక్కడక్కడ నగ్నంగా వొదిలేసి వొంపుల్ని చూపించినప్పుడే కొలనువైపు మళ్ళీ చూడాలనిపిస్తుంది.

"ఏమిటి! ఇంకా లేవదలచుకోలేదా మీరు. రాత్రి భోజనంకూడా సరిగా చెయ్యలేదు. లేచి ముఖం కడుక్కుంటే టిఫిను చేద్దురుగాని:" తలుపులు బార్లా తీసేసింది. రాత్రి తెచ్చిన మామిడి ముక్కల ప్లేటూ, గ్లాసూ తీసుకెళ్ళుదామని గదిలోకి అడుగుపెట్టి ఆగిపోయింది.

ప్లేటులో మామిడిముక్కలు ఎలా పెట్టినవి అలానే వున్నాయి అక్కడ!

"ఇవి తినలేదూ." అంది ఆశ్చర్యంగా.

"అవునుసుమా; వాటి విషయమే మర్చిపోయాను.

నాగావళి ఏమీ మాట్లాడలేదు. కొద్ది

క్షణాలు అతని ముఖంలోకి చూసి, గ్లాసు తీసుకుని వెళ్ళిపోయింది.

ఆ పగలల్లా మళ్ళీ ఆమె అతనికి ఎదురుపడనేలేదు. టిఫిను, కాఫీ ఆమె పట్టుకొస్తుందేమో అనుకున్నాడు. ఆమె రాలేదు. లోపల్నుంచి కబురొస్తే అతనే వెళ్ళాడు. ఆమెకు కోపం వచ్చిందనే సంగతి సాయంకాలానికిగాని అతనికి అర్థంకాలేదు. కొత్తలో మాట్లాడకపోయినా కనీసం కనిపించనైనా కనిపించేది. ఈరోజు ఉదయం తర్వాత ఆమె దర్శనమేలేదు. కనిపిస్తే వుదయం వెళ్ళొచ్చిన ఉద్యోగం సంగతి మాట్లాడా లనుకున్నాడు. అదీగాక వారం పదిరోజుల పాటు కాలక్షేపం అనుకున్న పుస్తకాల్ని ఐదు రోజుల్లోనే చదివేశాడు. కొత్తవి పట్టుకురమ్మనమని చెప్పాలి.

మధ్యాహ్నంనించీ మాటిమాటికీ వరండాలోకి వస్తూనే వున్నాడు — నాగావళి కనిపిస్తుందేమో నని. అలా

సాయంకాలం వరకూ చూసింతర్వాత చటుక్కున తట్టింది తను మామిడిపళ్ళ ముక్కల్ని తినకుండా వొదిలేసినందుకు కోపం వచ్చుంటుందని.

నవ్వుకున్నాడు.

తనకు కావలసింది ఇలాంటి హృదయమే. ఇంత సున్నితంగా స్పందించేదే కావాలి. అప్పుడప్పుడూ ఇలా కొపమూ, బెట్టుసరికూడా వుండాలి. దగ్గరగా వుంటూనే దూరంగా మెలగాలి. అలా వున్నప్పుడే అనుబంధం నిత్యనూతనంగా వుంటుంది. రోజూ వుదయించే సూర్య చంద్రులే అయినా రోజూ కొత్తగానే వుంటారు వారు. ఆ కొత్తదనం వాళ్ళ దాగుడుమూతల్లోనే వుంది. చీకటి నీడలమధ్య వెన్నెల వెల్తురులకు అందం. లోయల పక్కనే కొండలకు అందం. కన్నీళ్ళుపోసి పెంచితేనే చిరునవ్వులపూలు రంగుల్ని, సువాసనల్ని నింపుకుంటాయి. కొంతబాధ, కొంత నిరీక్షణ కావాలి. నిరీక్షణ ఆశగా ఊహించడం నేర్పుతుంది.

ఆ సాయంకాలం షికారుకు వెళ్ళినప్పుడు ఓ పాతిక మామిడిపళ్ళ బుట్టలో కట్టించి పట్టుకొచ్చాడు సదానంద.

"ఇదేమిటోయ్ పళ్ళు కొన్నావ్. ఇంట్లో వున్నాయిగా" అన్నారు రాఘవరావుగారు.

"చవగ్గా వొచ్చాయిలెండి. పట్టుకొచ్చిపడేస్తే యింట్లోవాళ్ళయినా తింటారు కదాని కొన్నాను."

"ఏమిటో నీ చేదస్తంగానీ యివన్నీ ఎందుకుచెప్పు," అని కూతుర్ని కేకేసి లోపలకు తీసుకెళ్ళమన్నారు.

నాగావళి వచ్చి పళ్ళు చూసి తనలో తనే నవ్వుకుని లోపలకు తీసుకెళ్ళిపోయింది.

చాలా సేపు రాఘవరావుగారితో ఉద్యోగ విషయాలు మాట్లాడుతూ కూర్చుండిపోయాడు. భోజనం వడ్డించి పిలుస్తే యిద్దరూ లేచారు. నాగావళీ వాళమ్మే వడ్డించింది. గబగబా భోజనం చేసి ముందుగానే లేచి వొచ్చేశాడు సదానంద. గదిలోకి వెళ్ళబోతుంటే వీధి వరండా స్తంభందగ్గర నాగావళి నిలుచునివుంది. అతన్ని చూసి యింట్లోకి వెళ్ళిపోబోతుంటే అతనే పలకరించాడు. ఆమె ఆగిపోయింది.

"సాయంకాలం కనిపిస్తే పుస్తకాలు ఏమన్నా పెట్టుకురమ్మనమని చెప్పాలనుకున్నాను. కనిపించనేలేదు. మొన్నటివి చదివేశాను," అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"ఉదయం ఉమాపతి రావుగార్ని కలుసుకున్నాను. ఖాళీవుంది, అప్లికేషను యిచ్చి, మంచిరోజు చూసుకుని చేరమంటున్నారు. ఉద్యోగం వచ్చినట్టే. ఆలోచించాలి మరి. తరుచుగా కేంపులు వుంటాయట," అన్నాడు తిరిగి.

అప్పటికీ ఆమె ఏమీ మాట్లాడలేదు.

"కోపం వచ్చింది కాబోలు మామిడి ముక్కలు తిన లేదని; నిజంగానే మర్చిపోయాను. నాకు మతిమరుపు ఎక్కువ. లేకపోతే మామిడిపళ్ళనే తినకుండా వొదిలేస్తానా. అవంటే నాకు చాలా యిష్టం. ఇష్టం గనకనే దారిలో చవగ్గా అమ్ముతుంటే కొని పట్టుకొచ్చాను యివ్వాళ. చిన్నప్పుడు మా వూళ్ళో రోజూ తోటల్లోకి పోయి దొంగ చాటుగా......"

నవ్వొచ్చిం దామెకు, నవ్వుకుని—

"ఇంత పెద్ద సంజాయిషీ యిచ్చుకో నక్కరలేదు లెండి. అయినా నాకు కోపం వచ్చుంటుందని ఎలా అనుకుంటున్నారు ?" అంది.

అవును; ఆమెకు కోపం వచ్చుంటుందని ఎలా అనుకుంటున్నాడతను. ఆమె కనిపించకపోవడానికి అనేక కారణాలు వుండొచ్చు. పని వత్తిడిలో వుండిపోయిందేమో! ఒంట్లో బాగుండలేదేమో!

ఆమె అడిగిన ప్రశ్నకు అతను సమాధానం చెప్పలేకపోయాడు.

"ఇంతకీ మీరు ఉమాపతిరావుగారి ఆఫీసులో చేరుతున్నారా ?"

"అదే ఆలోచిస్తున్నాను — తిరగాలట కదా."

"పోనీలెండి. ఆ చూసుకునే దేదో కాస్త మంచి ఉద్యోగం చూసుకుని చేరితేసరి. నాన్నగారు అదేదో బేంకులో

ఉద్యోగం చూస్తున్నారు. అదొస్తే బాగానే వుంటుంది. ఈ పదిహేను రోజులకూ కంగా రెందుకూ?"

సదానందకు ఆశ్చర్యంగా వుంది. ఇంతకుముందే రాఘవరావుగారు అడిగితే మంచిరోజు చూసుకునే చేరిపోవా లనుకుంటున్నాను అన్నాడు. అదేమాట నాగవళి ఎదుట అనలేకపోయాడు. నాగావళి ప్రభావం తనమీద పడుతోందా అన్న అనుమానం వచ్చింది అతనికి. అంతకుముందు చేరదామనే అనుకున్నాడు. కాని యిప్పుడు చేరాలని లేదు. నాగావళి ప్రభావం తనమీద పడిందనడానికి యింతకన్నా నిదర్శనం అతనికి అక్కరలేకపోయింది.

"నా వ్యక్తిత్వం ఏమైపోయింది... ఏమైపోయింది" అనుకున్నాడు దోచుకో బడినవాడిలాగ హృదయాన్ని తడుముకుంటూ.

మర్నాడు రాఘవరావుగారితో ఉద్యోగవిషయం చెప్పాడు.

"దాని కేముంది? అలానే. ఆ ఉద్యోగంలో చేరడం నాకుకూడా అట్టే యిష్టం లేదనుకో. సర్లే మరోటి ప్రయత్నిస్తున్నాను. వారం రోజుల్లో తెలుస్తుంది," అన్నారు.

సదానంద ఆ విషయం చెప్పినప్పుడు నాగావళి అవతలిగదిలోనే వుంది. కొద్దిసేపు కిటికీలోంచి అతన్నే తేరిపార చూసి, తిరిగి తన పనిలో తాను మునిగిపోయింది.

రాఘవరావుగారు ఆఫీసుకు వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళాక బయటితలుపు గడె పెట్టి నాగావళి తిరిగి వస్తుండగా చూసి గబగబా వరండాలోకి వచ్చాడు సదానంద.

"ఆ పుస్తకాలు చదివేశాను. అవి యిచ్చేసి కొత్తవేమైనా పట్టుకొస్తే..." మధ్యలోనే ఆగిపోయాడు.

"జ్ఞాపకం వుందిలెండి. మతిమరుపు మీకే గాని నాకు లేదు. పొద్దుటినుంచీ ఊపిరి సలుపుకోడాని కూడా తీరిక లేదు. ఇదిగో వంటపని పూర్తయ్యిందనుకుంటే వడ్డింపులూ అవీనీ; అవీ అయిపోతే తీరిగ్గా వెళ్ళి రావచ్చని ఆగిపోయాను."

సదానంద ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిటీ! వంట నువ్వే చేస్తావా?"

చాలా అమాయకంగానూ, అతి సామాన్యంగానూ "నేనే" అన్నట్టు తలూపింది.

"రోజూ నువ్వేనా?"

చాలా విచిత్రంగానూ, కొత్తగానూ చూసింది.

"అదేమిటి అలా అడిగారు?"

"ఏమీలేదు."

"ఊరికే అడిగుంటే అంత ఆశ్చర్యం దేనికీ. బహుశా నాకు వంట చేత కాదని అనుకుని వుంటారు. అవునా?"

"వంటరాదని ఎలా అనుకుంటాను. చదువుకొనేటప్పుడు రూంమేట్స్ అయిదుగురం. అందులో నలుగురికి వంటొచ్చు. మగాళ్ళకే వస్తోంటే ఆడాళ్ళకి రాదూ."

'మరి అలా అడిగారేం?"

అతనేమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు.

"చెప్పండి, వట్టినే అడిగుండరు."

చాలాసేపు అతనేమీ మాట్లాడలేదు. ఆతర్వాత మెల్లగా జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించి పొగవదుల్తూ—

"మీ దేన్సు గురువుగారు ఎవరు?" అన్నాడు.

తెల్లబోయిందామె. అర్థంకాని అయోమయంతో కళ్ళు చిట్లించి, ఇబ్బందికరంగా జారిన యిరుకుచూపుల్ని అతనిమీద నిలిపి, ముఖంనిండా అల్లుకున్న ఆ బాధముడుల్ని మెల్లిగా సడలిస్తూ ఆలోచనల్లోకి దూరి చూస్తోంది.

“అదే – చిన్నప్పుడు డేన్సు నేర్పిన గురువుగా రెవరో తెలుసుకుందామని.”

నవ్వుల్తో పగిలిపోయి బేలన్సు నిలుపుకోలేక నిజంగానే డేన్సు చేసింది ఆమె. “నేనా ... నేను డాన్సు నేర్చుకోవడ మేమిటండీ...కలగన్నారా?”

“సారీ ... డేన్సంటున్నా నేమిటీ. డేన్సుకాదు. సంగీతం నేర్పిన గురువుగారి పేరేమిటీ?”



“ఇది మరీ బావుందండోయ్. ఇవ్వాళ .చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారే మీరు. నేను నేర్చుకోవడం అటుంచి కనీసం నేర్చుకున్న స్నేహితురాళ్ళయినా లేరుకదా నాకు! ఏమిటి ఇలా అడిగారు!”

“ఏమిటో. వచ్చుంటుందని అడిగాను మరేంలేదు. ఇవ్వాళ కూజాలో నీళ్ళు పోశారా. దాహంగావుంది. ఓ గ్లాసుడు నీళ్ళు తెచ్చిపెడతావా?”

తెగిపోయిన కలమత్తులోంచి కదిలి వెళ్ళినట్టు ఆలోచనల్లో ఊగుతూ మెల్లగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్ళింది నాగావళి. రెండు నిమిషాల్లో గ్లాసుతో మజ్జిగ పట్టుకొచ్చింది.

“ఇదేమిటీ! మంచినీళ్ళు తెమ్మంటే మజ్జిగ పట్టుకొచ్చావ్. కూజాలో నీళ్లు పోయలేదూ యివ్వాళ?” అన్నాడు అతను.

“పోశారుగానీ ముందివి తీసుకోండి. అంతగా కూజాలో నీళ్ళు తాగాలంటే మరో గ్లాసుతో తెస్తాను.”

“అదికాదు......”

“అది అయినా కాకపోయినా ముందు యివి తీసుకోండి. ఇదేమీ కషాయం కాదు. తీసుకోండి.”

గ్లాసు అందుకుని తాగుతూ మధ్యలో ఆపేసి –

“ఏమిటా అధికారం? ఆ శాసింపు ఏమిటి? అలా బలవంతంచేసి తాగించక పోతేనేం. పోనీ ఆ కంఠాన్ని మరికాస్త మృదువుగా, నెమ్మదిగా పలికిస్తే ఏం వొరిగిపోయింది’– అనుకున్నాడు. ఓసారి ఆమె ముఖంలోకి చూసి మిగిలిన మజ్జిగనుకూడా గడగడా తా. శాడు.

ఆమె గ్లాసుతీసికుని వెళ్ళిపోబోతూ ఆగిపోయి “ఇంతకీ మీరు అసలు విషయం చెప్పకుండా దాటేశారుకదూ. చెప్పరా ఎందుకడిగారో?” అంది. ముఖం కొద్దిగా వంచి, బ్రతిమాలుతున్న ధోరణిలో

కళ్ళకొసల్ని జాలితో తడిపి, కనుగుడ్లను రెండింటినీ మూలల్లో నిలిపి రెప్పల్ని వాల్చకుండా అతనినే చూస్తూనిలుచుంది.

"ఊరికే యథాలాపంగానే అడిగాను. మరీ యింతగా పట్టించుకుంటా వేమిటీ? ఏమీలేదు." అన్నాడు గదిలోకి వెళ్ళిపోతూ. నాగావళికూడా చాలా సేపు అక్కడే నిలుచుని యింట్లోకి వెళ్ళిపోయింది.

భోజనాలు అయిపోయాక పుస్తకాల గురించి వెళ్దామనుకుందిగానీ కుదరలేదు. ఇంట్లో అప్పడాలు చేస్తోంచే ఆ పనిలో మునిగిపోయింది. సాయంకాలానికిగాని వెళ్ళి తీసుకురావడం పడలేదు. తీరా తెచ్చేసరికి సదానంద షికారుకు వెళ్ళిపోయాడు. అతను తిరిగివచ్చేసరికి రాత్రయిపోయింది. అతను రావడం చూసి, కొద్దిసేపు వూరుకుని పుస్తకాలు పట్టుకుని వచ్చింది నాగావళి.

చాపమీద కూర్చుని ఉత్తరం రాసుకుంటున్న సదానంద తనమీద నీడపడితే తలెత్తిచూశాడు. పుస్తకాలు పట్టుకుని నిలుచునివుంది నాగావళి. ఆమె నీడనుంచి తప్పుకునిలవతలకు జరిగి కూర్చున్నాడు.

"పుస్తకాలు తెచ్చావా? చాలాథేంక్స్. నీకు శ్రమయిస్తున్నానుకదూ." పుస్తకాలు అందుకుని, ఓసారి అలా తిరగేసి పక్కనపెట్టి "నువ్వు చదివావా వీటిని? ఎప్పుడూ పుస్తకాలు చదువుతున్నట్టే కనిపించవు. సాహిత్యం అంటే యింట రెస్ట్ లేదా నీకు?" అన్నాడు.

"ఏమీ తోచకపోతే చదువుతుంటాను. మరీ మీలా పిచ్చిగా చదివే అలవాటు నాకు లేదులెండి. వాటిని అర్థంచేసుకునే శక్తికూడా వుండాలికదా! అంతపెద్ద చదువులు నేను చదువుకోలేదు."

అకస్మాత్తుగా మౌనముద్రలోకి వెళ్ళినట్టు కొన్ని నిమిషాలు అత నేమీ మాట్లాడలేదు. ఆమె చూసిచూసి చివరకు వెళ్ళిపోదామనుకుని "భోజనం వడ్డించేసింది అమ్మ. పిలుద్దామనే వచ్చాను. ముందు భోంచేసి ఆ తర్వాత కూర్చుని రాసుకోండి." అంది. వెనక్కుతిరిగి రెండడుగులు వేసింది.

"నాగావళీ!"

చెంగుపట్టుకుని లాగి నిలేసినట్టు చటుక్కున నిలబడిపోయింది.

"నిజంగానే నీ కేమీ చేతగావా?"

ఆమెకు అర్థం కాలేదు. రెప్పల్ని ఎగరేసి ఏమిటి అన్నట్టు చూసింది.

"అదే ... ఏ ఒక్క కళలో నూ ప్రవేశంలేదా — నీకు. ఆఖరికి సాహిత్యంలోకూడా లేదా?"

కొద్దిక్షణాలు రెప్పల్ని వాల్చకుండా అతన్నే చూసింది.

అర్థమయ్యింది. ఉదయం ఆయన అడిగిన విచిత్ర ప్రశ్నలవెనక ఆయన హృదయంలోని ఉత్సుకత యిప్పుడు అర్థమయ్యింది. తన కేదో వచ్చుంటుం

దని ఎందుకనుకున్నారు. అంతకల్పన దేనికీ? ఊహల్లోనే జీవిద్దామని తప్ప మామూలుగా జీవించడానికి ఎందుకు ప్రయత్నించరూ? ఆకాశంలో ఎగరడమేగాని భూమ్మీద నడవడం చేతకాదా? ఇలాంటి మనుషులు ఎలా బ్రతగ్గలుగుతారు?

అతన్ని చూస్తే ఆమెకు జాలేసింది. అప్రయోజకుడైన కొడుకును చూసి కోపం రాకపోగా మరింత ప్రేమ పొంగి, ఆలోచనలన్నీ అతన్నే అల్లుకుని, గొడుగుపట్టి చల్లని నీడల్ని కురిపించి సేదదీర్చి, మరింతగా తనకడుపుతీపిని పంచియిచ్చిన తల్లి మనసులా నాగావళి హృదయం కరుణతో తడిసి, చల్లటి ఆలోచనల్ని గాలులుగా అతనిమీదకు విసిరి, అతని ఆకారాన్ని ఆమెకళ్ళల్లో నిలుపుకుని రెప్పలకింద భద్రంగా దాచుకుంది.

"మరీ అంత ఊహల్తో బ్రతకడం మంచిదికాదు. లేవండి. భోజనం చేద్దురు గాని. అందరూ తినేశారు; మీ రొక్కరే మిగిలారు. అవలావుంచండి. నేను సర్దుతానుగానీ ముందు మీరు కదలండి."

అతను కదిలి వచ్చేవరకూ ఆమె అక్కడే ఎదురుచూస్తూ నిలుచుంది.

ఆమె వెనకనే వెళ్తూ 'ఇలా ఈమె శాసించడం ఏమీ బావుండలేదు; అబ్బే, ఏమీ బావుండలేదు' అనుకున్నాడు.

అతని మనసంతా అదోలా అయిపోయింది. అతను అద్దిన రంగుల్ని చెరిపే

సుకుని నాగావళి అతనిముందు నిలుచునే సరికి మనసు చివుక్కుమంది. కిందపడి, రెక్కలు విరుచుకున్న పక్షిలా గిలగిల్లాడింది.

భోజనం దగ్గర మరీ పరధ్యానంగానూ, ఐశ్వర్యాన్ని కోల్పోయినవాడిలా కళావిహీనంగానూ కూర్చుని అతను భోజనం చేయడం నాగావళి చూసింది. వాళ్ళమ్మ అక్కడే వుండడంవల్ల ఏమీ మాట్లాడలేకపోయింది. భోజనం అయిపోయాక అతనిగదిలో మంచినీళ్ళు పెట్టడానికని వచ్చి "బాధపడుతున్నారు కదూ మీరు. మీ ఊహలకు తగ్గట్టు లేను. ఏం చేస్తాను. ఎందులోనూ ప్రవేశము లేకపోవడం అది నా దురదృష్టం," అంది. దుఃఖంలో తడిసి అక్షరాలు ఒకదానితో ఒకటి అంటుకుపోయిన స్పష్టతలేని బొంగురుకంఠాన్ని వినేసరికి అతను చలించిపోయాడు. అంతకు ముందు ఎప్పుడూ ఆమె అలా కాలేదు. ఆమె కంఠాన్ని అలా వినడం అదే

మొదటిసారి. చిరునవ్వుతో సాగిన పెదాలనో, అధికారంతో తెరచుకున్న పెదాలనో, అప్పుడప్పుడు కోపంతో బిగుసుకుపోయిన పెదాలనో చూశాడుగాని దుఃఖంతో యిలా వణికిపోయిన పెదాలను చూడలేదు. అది అతను భరించలేకపోయాడు.

"బాధపడడంలేదు నాగావళీ! బాధపడాల్సిన అవసరంకూడా లేదు. నాకు కూడా ఏవీ చేతకావు. అందుకని నే నెప్పుడూ బాధపడలేదే. మన మంతా కళాకారులం కాలేం. కళను అర్థం చేసుకోగలిగే ఈ స్థటిక్ సెన్స్ వుంటే చాలు. అంతకన్న అదృష్టం ఎందుకూ," అన్నాడు.

మంచినీళ్ళు పెట్టేసి నాగావళి వెళ్ళిపోయింది.

'నీ కేమీ చేతగాకపోయినా నా జీవితాన్ని రసాత్మకం చెయ్యగలవు. చాలు' అనుకున్నాడు. ఆ తర్వాత——

'శాసించడం మానుకోవాలి నాగావళీ. అందమైన, ఎర్రని నీ నాజూకు పెదాలు అనురాగస్వరాల్ని మీటడానికే తప్ప శాసించడానికి కాదు—' అనుకున్నాడు.

నాగావళి అతని జీవితంమీదకు పొగమంచులా జారి, బిందువులుగా విడిపోయి, వెలుగుకిరణాల్ని అందుకుని, సప్తవర్ణాలుగా వికేంద్రీకరించి, ఆ విడిన రంగులను తిరిగి అతని జీవితంమీదనే కుమ్మరించి రంగులు అద్ది మరింత అందంగా శోభాయమానంగా తీర్చిదిద్దుతుంది. మరొకప్పుడు సరుగుడు తోటలోంచి వీచిన చల్లని గాలితెరలా అతని జీవితం మీదకు దిగి అతని ఆలోచనల కొసల్ని అందుకుని ఆకాశంలోకి ఎగిరి, అక్కడ మేఘాలమీద నిలిపి, దూరతీరాల్లోని రంగురంగుల పూలను చూపి, గొప్ప అనుభవంతో నింపివేస్తుంది. ఇంకొకప్పుడు కెరటంలా వచ్చి అతని జీవితాన్ని చుట్టుముట్టి, ఉద్రేకంతో ఒక్క కుదుపు కుదిపి పెకలించి కదిల్చి సప్తవర్ణాలతో మెరిసే ఇసుక సింహాసనంమీద ప్రతిష్ఠిస్తుంది. కాని అన్నిటినీమించి ఎక్కువగా తన వ్యక్తిత్వాన్నే గొడుగులా అతని జీవితంమీద పట్టి, ఎండనీ, వాననీ అతనిమీద వాలనీకుండా కాపాడుతుంది.

కాని ..

అతను అప్పుడప్పుడు వర్షంలో తడుస్తూ నడవాలనీ, ఎండలో తిరగాలనీ అనుకుంటాడు. ఆమె ఒదిలిపెట్టదు. అతనికి కోపం వస్తుంది. బాధకూడా కలుగుతుంది.

ఇలా చాలాసార్లు జరిగింది

వారంరోజుల తర్వాత అతనికి బేంకులో ఉద్యోగం దొరికింది. ఆరోజు షికారుకు వెళ్ళొచ్చిన సదానందతో "మీ కో మంచివార్త చెప్తాను, నా కేమిస్తారు ?" అంది.

"నీ యిష్ట మొచ్చింది కోరుకో. యిస్తాను," అన్నాడు.

"అదే వొద్దు. అలా కలల్లో నిలుచుని మాట్లాడతా రెందుకు. మామూలుగా మాట్లాడండి," అంది.

అతని మనస్సు చివుక్కుమంది. 'ఈమెకు తన మాటలే ప్రధానమా? హృదయం ప్రధానం కాదా? ఈమాటల వెనుక తన హృదయాన్ని గుర్తించదేం' అనుకున్నాడు. మూర్తి ముడుచుకొని లోపలకు వెళ్ళిపోబోతోంటే కూడావచ్చి "పోనీలెండి; ఏ బహుమతీ యివ్వక్కర లేదు గానీ యీ మాట ఆలకించండి — మీకు బేంకులో ఉద్యోగం వచ్చింది."

మరొకప్పుడైతే ఆనందంతో 'అలాగా? అయితే తప్పకుండా నీకు బహుమతి యివ్వాల్సిందే. రేపే నీకు ఫలానా వస్తువు బహుమతి చేస్తాను' అనేవాడు. కాని ఇప్పుడలా అనా లనిపించలేదు. తన హృదయాన్ని గుర్తుపట్టనప్పుడు ఎందుకు దాన్ని బైటకు తీసి ప్రదర్శించాలి?

'ఆహా' అన్నట్టు తలమాత్రం ఊపాడు.

ఆమె దెబ్బతింది. అయినా తేరుకుని మామూలుగానే, "నాన్నగారు చెప్పారు మీకు ఉద్యోగం వచ్చిందని. ఆ కాగితం వారిదగ్గరే వుంది. నిద్రపోతున్నారు గాబోలు. పొద్దున చూద్దురుగాని," అంది.

ఏమైనా ఆ రోజు ఉండాల్సినంత ఆహ్లాదకరంగా లేదు వాతావరణం.

సదానంద మంచిరోజు చూసుకుని

ఉద్యోగంలో చేరాడు. మొదట్లో కొంత కొత్తగావున్నా రానురాను అలవాటైపోయింది. టైముకు వెళ్ళడం, టైముకు రావడం. బేంకులో కూర్చునంతసేపే బాధ్యతలు. బైటికొస్తే మరేచింతా వుండదు. సాయంకాలంపూట కాస్సేపు అలా ఏ సముద్రపు ఒడ్డునో కూర్చుని మెల్లగా యింటికి వచ్చేవాడు. భోంచేసి ఏ నవలో పట్టుకుంటే రాత్రి పన్నెండయిపోయేది.

"మరీ అంతరాత్రివరకూ మేల్కొని వుంటారెందుకూ? ఆరోగ్యంపాడౌతుం" దని అనేకసార్లు నాగావళి కసురుకొనేది. ఐనా వినేవాడు కాదు. కాస్సేపైనా చదవకపోతే నిద్రరాదు అనేవాడు. కోపం వచ్చి పుస్తకాలు పట్టుకురావడం మానేసింది. ఎక్కడైనా లైబ్రరీలో చేరాడో ఏమో తనే తెచ్చుకుంటుండేవాడు.

ఒకసారి మామ్ 'రైటర్స్ నోట్ బుక్' తెచ్చాడు. భోంచేసి పుస్తకం పట్టుకూర్చున్నాడు. రాత్రి పదయ్యింది.

లైట్లు ఆరిపోయాయి. వస్తాయేమోనని అర్థగంటసేపు కాచుకూర్చున్నా ఎంతకీ రాలేదు. విసుగొచ్చింది. గత రోజు కూడా యింతే. మునిసిపాలిటీవారిమీద కోపంవచ్చి తిట్టుకున్నాడు కూడాను. లైట్ల గురించి ఎదురుచూస్తూ కూర్చుని కూర్చుని చివరికి నిద్రపోయాడు. ఆ మర్నాడు, బేంకులో పక్క సీటు ఆయనతో మునిసిపాలిటీవాళ్ళ చేతకాని తనాన్నిగూర్చి తీవ్రంగా చర్చించాడు. స్థానిక రాజకీయ వారపత్రికలో సంపాదక లేఖావళికి ఒక ఉత్తరంకూడా దీని మీద రాద్దామనుకున్నాడు. రాత్రి భోజనందగ్గర కొద్దిగా ఈ విషయం నాగావళితో చర్చించాడుకూడాను.

ఏం లాభం, ఆ రాత్రికూడా అలానే అయ్యింది.

పదింటికి లైట్లు ఆరిపోతే పంతంపట్టి గంటసేపు కూర్చున్నా లైట్లు రాలేదు. అయితే ఆరోజు జాగ్రత్తపడి ముందే కొవ్వొత్తులు కొనుక్కుని వచ్చాడు. ఒకటి వెలిగించి కూర్చున్నాడు. ఆ వెలుతురుకింద చదవడం సాధ్యం కాలేదు. కళ్ళు మండాయి. వీధి వరండాలోకి వచ్చాడు. సిగరెట్టు కాల్చుకుందామని అగ్గిపుల్ల వెలిగించేసరికి నడవా కిటికీ వెనక గాజులచప్పుడు వినిపించింది. అటు చూశాడు. పక్కకు తప్పుకున్న అస్పష్టమైన ఆకారం ఒకటి క్షణంపాటు కనిపించి మాయమైపోయింది.

నాగావళే. ఆ బుట్టలోలకులు ఆమెవే. ఇంత రాత్రివరకూ నిద్రపోలేదా! ఏం చేస్తోంది?

చటుక్కున మెరుపులా ఓ ఆలోచన తట్టి అవతలికి వెళ్ళి చూశాడు. ఆ యింటికి అటూ యిటూ వున్న యిళ్ళల్లో దీపాలు వెలుగుతూనే వున్నాయి. ఇవతలి యింట్లో అంతా నిద్రపోతున్నారు గాబోలు, ఓ గదిలో మాత్రం అతి నీరసంగా, రోగిష్టివాడిలా నీలంరంగు బెడ్ రూమ్‌లైటు వెలుగుతోంది. అవతలి యింట్లో యింకా నిద్రపోలేదేమో ట్యూబులైటు వేసివుంది.

అతనికి అర్థమయ్యింది. ఇది నాగావళి పనే. ఇంట్లో మెయిన్ ఆపేస్తోన్నట్టుంది. ఎందుకిలా చేస్తోంది? తనచుట్టూ హద్దుల్ని ఎందుకు గీస్తోంది? కొన్ని విషయాలలో తనంతట తాను కల్పించుకుని తలదూర్చినా అందంవుంది. ప్రతిదీ పట్టించుకోవడం ఏమీ బావుండలేదు— నాగావళిమీద కోపమేకాదు చాలా చిరాకు కూడా వచ్చింది.

సిగరెట్ల విషయంలోనూ ఇంతే జరిగింది. అతనికి సిగరెట్లు కాల్చే అలవాటు వుంది. ఎక్కువగానే కాలుస్తుంటాడు. ఈ వూరొచ్చింతర్వాత మరీ ఎక్కువయింది. నాగావళి చూసినా ఆట్టే పట్టించుకోలేదు.

ఒకరోజు పనిమనిషి రాకపోతే నాగావళే వెళ్ళి అతని గది ఊడ్చింది. అప్పుడు పోగయిన సిగిరెట్టు పీకెలు చూసేసరికి ఆమెకు ఆశ్చర్యమేకాదు కోపంకూడా వచ్చింది.

"మీ పద్ధతేమీ నచ్చలేదు. ఒక్క రాత్రిలో యిన్ని సిగరెట్లా ఈ లెక్కన రోజుకి ఎన్ని పెట్లు తగలేస్తుంటారు. ఏమీ తోచకపోతే ఏ ఒకటో రెండో కాల్చినా అర్థంవుంది. మరీ యిన్నటండీ! ఇలా రాత్రిళ్ళు నిద్రపోక సిగరెట్లు తగలేస్తూ కూచుంటే ఎప్పుడో ఒకప్పుడు ఒంటికి తెచ్చుకునేట్టే వున్నారు." అంది. టేబిలుమీద సిగరెట్టుపెట్టె వుంటే తీసి చింపేసి, సిగరెట్లను చిదిమి పారేసింది.

నాగావళి కోపం ప్రదర్శించినా నవ్వొచ్చేట్టుగానే వుంది. పెట్టెను ముక్కలు ముక్కలుగా చింపేసి సిగరెట్లను చిదిమి పారేయాలన్న పొడుగాటి నాజూకైన వేళ్ళ కంగారు, పిడికిలి బిగింపులో కసి, వాసనని భరించలేక అసహ్యించుకుంటున్న చిట్లించిన నాసికాపుటాలు, బలాన్ని ఒకేచోట కేంద్రీకరించి సడలిపోకుండా బిగబెట్టిన పెదాలు, మాటిమాటికీ అతని ముఖంలోని మార్పుల్ని కొలుస్తూ ఎగిరే చూపులు చూసేసరికి అతను నవ్వాపుకోలేకపోయాడు.

అతను నవ్వుతోంటే ఆమెకు ఉక్రోషము వచ్చి, తుడిచిన తుక్కయినా ఎత్తకుండా ఎక్కడిదక్కడే వదిలేసి వెళ్ళింది.



'బావుంది; చాలా బావుంది. అసహాయతలోంచి వచ్చిన కోపంలో మరీ అందంగా వుంటుంది సుమా' — అనుకున్నాడు అతను.

అప్పటినించీ అతను సిగరెట్టు పెట్టెగానీ, అగ్గిపెట్టెగానీ బయట వుంచేసేవాడు కాదు. ఉంచేస్తే చింపిపారేయకుండా ఆమె వొదిలిపెట్టేది కాదు. మొదట్లో ఆమె చింపిపారేస్తోంటే అందంగానే అనిపించేది కాని, రాను రాను చికాకు కలుగుతుండేది. ఇదికూడా తనను శాసించడమే అనిపించింది అతనికి.

'అవును. ఇది శాసించడంకాక మరేమిటి? తన స్వేచ్ఛకు హద్దుల్ని ఏర్పరచడం తనమీద అధికారాన్ని చెలాయించడం కాదూ. చాలా తెలివిగా శాసిస్తోందే! తనకు తెలియకుండా తననుకట్టి పడేయాలని చూస్తున్నట్టుంది. తనదైన వ్యక్తిత్వం తనకు లేకుండా చేస్తోంది యీమె—' అనుకున్నాడు.

రోజూ ఏదో ఒక సంఘటన జరుగుతూనే వుంది. ఆమె ప్రతిపలుకూ తనను శాసించడానికే, ఆమె ప్రతిచర్యా తనను కట్టిపడేయడానికే అన్నభావం అతనిలో మరీ బలపడిపోయింది. ఆమెమీద చిరాకూ, కోపమూ వస్తున్నాయి. ఆ విషయం ఆలోచిస్తోంటే ఒక్కొక్కప్పుడు అతనికే ఆశ్చర్యంగా వుండేది.

* * *

సదానంద తొలిజీతము అందుకున్నాడు. తన ఖర్చులకింద కొంత డబ్బు రాఘవరావుకిస్తే ఆయన పుచ్చుకోలేదు.

"ఈ నెలనించేకదోయ్ సంపాదనలో పడ్డావు. వొచ్చేనెలనుంచి చూద్దాంలే. ఇంటికి పంపించు," అన్నారు ఆయన.

ఇంటికి డబ్బు పంపించడం కన్న తల్లికీ, అక్కకూ బట్టలు తీసి పంపిస్తే బావుంటుందనిపించింది. చీరలగురించి తనకు తెలీదుకదా, ఎట్లా? – అనుకుంటుండగా చటుక్కున నాగావళి జ్ఞప్తికి వచ్చింది. ఆమెకు ఆ విషయం చెప్పాడు.

"అలానేలెండి. రేపు ఎలాగూ మేం బజారుకు వెళ్ళదలచుకున్నాం. స్నేహితురాలు ఏవో బట్టలు తీసుకుంటానంది. నేనుకూడా జాకెట్టుగుడ్డలు తీసుకోవాలి. రేపు ఆఫీసునుంచి నేరుగా యింటికొచ్చేస్తే యిక్కడ్నుంచి కలిసి వెళ్ళొచ్చు." అంది.

"నేనెందుకు మళ్ళీ. మీ రిద్దరూ ఎలాగూ వెళ్తున్నారుకదా. మీరే తెచ్చెయ్యండి." అన్నాడు.

"తెచ్చేసాంలెండి. తమరూ రండి. ఫరవాలేదు." అంది నాగావళి.

ఆ మాటలు విన్న తర్వాత అతనికే సిగ్గేసింది. మరేమీ మాట్లాడలేకపోయాడు.

మర్నాడు సాయంకాలం ఆఫీసునుంచి తిన్నగా యింటికే వచ్చేశాడు. నాగావళి స్నేహితురాలుకూడా వచ్చింది. ఇంట్లో చెప్పి బజారుకు బయలుదేరారు.

వాళ్ళు తరచుగా బట్టలు కొనే దుకాణం ఒకటివుంది. అక్కడకు వెళ్ళారు. నాగావళి స్నేహితురాలు పి.డబ్లు.డి. ఇంజనీరుగారి అమ్మాయి. కాస్త పెద్ద ఎత్తునే బట్టలు ఖరీదుచేసింది. అంత పెద్ద ఖరీదు చేసిన అమ్మాయిపక్కనే తవి బ్లౌజు పీసులు ఖరీదుచేస్తున్న నాగావళిని చూస్తే అతనికి జాలేసింది. అక్కకూ, తల్లికీ చీరలు సెలక్టు చేయించి తీసుకుని, నాగావళికికూడా ఒకటి తీసికోబోయాడు. "నాకెందుకూ చీర. కొని, యింకా వాడని కొత్త చీరలే రెండోమూడో పెట్లో వున్నాయి. కిందటి నెల్లోనే మే మిద్దరమూ వచ్చి ఓ చీర కొనుక్కెళ్ళాం. వొద్దు, తియ్యకండి," అంది. ఆచీర లోపల పెట్టించేసింది.

సదానందకూడా తన కేవైనా బట్టలు తీసుకుందామనుకున్నాడు. పేంటుగుడ్డలు చూస్తోంటే నాగావళి "ఇదేమిటిగాని మీకు లాల్చీ షరాయి చాలా చక్కగా



నవ్వుతుంది – అవి తీసుకోండి," అంది.

"నా కవి నచ్చవు. కళాకారుడి వేషం వేసినట్టుంటుంది," అన్నాడు.

"లేదు. అవి మీకు చాలాబాగా సరి పోతాయి. సన్నటివాళ్ళకు లాల్చీ షరాయి బావుంటుంది. ఓ జత కుట్టించుకుని చూడండి." అంది తిరిగి.

"వొద్దులేద్దూ. నాకు నచ్చనిది," అనే శాడు.

"అదికాదు. ఒక్కజత కుట్టించుకుని చూడండి. మీకు చాలా బావుంటుందంటే నమ్మరేం." అని అ వెంటనే "ఏదయ్యా లాల్చీ షరాయిలకు మంచి గుడ్డవుంటే చూపించు," అంది కొట్లో గుమాస్తాతో. రెండుమూడురకాలు చూసి ఓరకం పైకి తీసి "ఇది బాగున్నట్టుంది కదూ!" అని సదానందకు చూపించింది.

నాగావళి ప్రవర్తన సదానందకు చాలా చికాకు కలిగించింది. అప్పటికే కొట్టువాడూ, గుమాస్తాలూ వాళ్ళ సంభాషణని ఆలకించారు. నాగావళి స్నేహితురాలుకూడా పెదాల్ని బిగబెట్టి నవ్వాపుకుంటోంది. అవన్నీ సదానంద గుర్తించాడు. అతనికి చిరాకు వేసింది. 'ఇప్పుడొద్దు. తర్వాత తీసుకుంటాలే' అని అందామనుకున్నాడుగాని అప్పటికే నాగావళి ఆయనకు ఎంతగుడ్డ కావాలో లెక్కగట్టి చింపి యిచ్చెయ్యమని ఆర్డరు యిచ్చేసింది.

ఆకొట్టు అరుగుమీదే ఓ మిషను పెట్టుకుని టైలరు ఒకడు వున్నాడు. అతనికి ఇచ్చేసి కొలతలు తీసుకోమంది నాగావళి. "మళ్ళీ ఎక్కడికో వెళ్ళడం ఎందుకూ. యీయనకిచ్చేస్తే యీయనే కుట్టేస్తాడు. నాన్నగారుకూడా యితని దగ్గరే కుట్టించుకుంటారులెండి. బాగానే కుడతాడు; కొలతలు ఇవ్వండి,''అంది, సంజాయిషీ యిచ్చుకుంటున్నట్టు సదానందతో.

సదానందకు సహనం సన్నగిల్లిపోతోంది. అనవసరగా అక్కడ అల్లరి పడడం యిష్టంలేక మౌనంగా కొలతలు యిచ్చేశాడు.

ఆకొట్లో ఎక్కువసేపు వుండబుద్ధేయ లేదు అతనికి. అక్కడ అందరిచూపులూ తనమీదే వున్నట్టనిపించాయి. బిల్లు చెల్లించేసి బయటపడ్డాడు.

"ఇంటికేనా," అంది నాగావళి.

అతను సమాధానం చెప్పకుండా నడుస్తున్నాడు.

ఆమె తనలో తనే నవ్వుకుంది.

కొంతదూరం వెళ్ళిన తర్వాత తనకు పనుంది, అటు వెళ్ళా లని గాలికి చెప్పి నట్టు చెప్పి గబగబా అడుగులు వేసు కుంటూ మరోవైపు వెళ్ళిపోయాడు సదా నంద. అలా వెళ్ళివెళ్ళి సముద్రపుటొడ్డు కొచ్చి కూర్చున్నాడు.

ఎదుటివారి యిష్టాయిష్టాల్ని ఎందుకు గుర్తించ దీమె. ఇతరులకుకూడా వ్యక్తి త్వాలు వుంటాయనీ వాటిని గౌరవించా లనీ యీమెకు తెలీదా? ఇతరుల వ్యక్తి త్వముమీద తన ప్రభావాన్ని ప్రసరింప జేయడం స్వార్థపరుల లక్షణం అని ఎందుకు గుర్తించదు. ఆ బలవంత మేమిటి. ఆ అధికారాన్ని ఎవరిచ్చారు. జీవనసామ్రాజ్యంలో మహారాజ్ఞి అవుతు న్నంత మాత్రంచేత ఆ జీవితాన్ని శాసించడానికి పూనుకోవడం తెలివైన పనికాదు. శాసించేకంతాన్ని తను భరించ లేడు. ఇతరుల వ్యక్తిత్వపు నీడల్లో నిల బడడం తనకు యిష్టంలేదు. స్వేచ్ఛాజీవి తానికి అలవాటుపడిన తను ఏ పరిధుల మధ్యా ఆనందంగా జీవించలేడు. జీవించ గలననుకోవడం ఆత్మవంచనే – అను కున్నాడు.

అతని మనసంతా వికావికలుగా అయిపోయింది. ఇంతకాలంగా అతను హృదయంలో నిలుపుకున్నరూపం మంచులా కరిగి నీరుగారిపోయింది. అక్కడ అతనికొరకు మిగిలిందేమీలేదు. తన సర్వస్వమూ కోల్పోయినవాడిలాగ అతను బాధపడ్డాడు.

రాత్రి బాగా పొద్దుపోయేవరకు అతను ఆలోచనల్లోనే గడిపి మెల్లగా యింటిని చేరుకున్నాడు.

నాగావళి మేలుకునేవుంది. తలుపు తట్టితే వొచ్చి తలుపు తీసింది. ఆవిడే భోజనంకూడా వడ్డించింది. చాలా ముభా వంగా భోంచేసి లేచిపోయాడు. గదిలో కొచ్చి కొవ్వొత్తి వెలిగించి, ఏదో రాసుకుంటూ కూచున్నాడు. నాగవళి మంచినీళ్ళు పెడదామని వొచ్చి చూసి, కరెంటుదీపంవెలిగించి వెళ్ళిపోయింది. ఆ వెనకనే లేచొచ్చి కరెంటుదీపం ఆర్పేసి, కొవ్వొత్తి వెలుతుర్లోనే రాసుకుంటూ కూచున్నాడు. రాయడం పూర్తయ్యాక, కొవ్వొత్తి కరిగికరిగి చీకట్లో మునిగి పోయేవరకూ దాన్నే చూస్తూకూర్చుని, నిద్రపోయాడు.

ఉదయం రాఘవరావుగారితో "మధ్యా హ్నము బండికి వూ రెళ్తున్నానండీ. నిన్ననే మా అమ్మ వుత్తరం రాసింది ఓసారి రమ్మనమని," అన్నాడు.

"అప్పుడే యింటిమీద బెంగెట్టేసు కున్నావుటోయ్. భలేవాడివే," అని ఓవిట్టు విసిరి, విసిరినందుకు నవ్వుకుని "సర్లే వెళ్ళిరా. నిన్న మీ అక్కయ్యకీ, అమ్మకీ బట్టలుకూడా తీసుకున్నావటగా. మంచిపనిచేశావ్. తొలిజీతం అలాగే చెయ్యాలి. నేనూ చిన్నప్పుడు యింతే చేశాను. అదిసరేకాని అక్కడ ఎక్కువ

రోజులు వుండిపోక. కొత్తవుద్యోగం కదా బావుండదు." అన్నాడు ఆయన. ఆఫీసుకు వెళ్ళిపోతూ "ఎక్కువరోజులు వుండిపోకుండా త్వరగా వచ్చెయ్. వీలయితే మీ అమ్మనుకూడా తీసుకురా" అని మరోసారి హెచ్చరించారు.

సామాను సర్దుకుంటుండగా నాగావళి వచ్చింది.

"వూరు వెళ్తున్నారా ... నిన్న మాట మాత్రంగానైనా చెప్పలేదేం?" అంది.

"పొద్దున్న చెప్పాగా. మీ నాన్నగారితో చెప్తున్నప్పుడు నువ్వూ విన్నావు కదూ."

"అంతేనా? అంతకన్న ప్రత్యేకంగా చెప్పాలనుకోలేదా మీరు."

"ఎందుకనుకోలేదూ. తప్పకుండా నీకు చెప్పే వెళ్తాను. అలా చెప్పాల్సిన అవసరంకూడా వుంది."

నాగావళి అనుమానంగా చూసింది. అతను చూపులు మార్చుకున్నాడు.

"భోజనం వడ్డించేస్తావా, బండికి టైమయినట్టుంది."

"అలాగే...రండి" అంటూ వెళ్ళిపోయిందామె.

భోజనం చేసి, కాస్సేపు కూర్చుని యింట్లో అందరికీ చెప్పి బయలుదేరాడు. బయలుదేరేముందు నాగావళికి మళ్ళీ మరొకసారి చెప్పి "మీ స్నేహితురాలికి కూడా చెప్పు. అన్నట్టు ఆమె పుస్తకాలు యిచ్చేసెయ్. ఇచ్చేముందు అందులో ఏమైనా రూపాయలు వున్నాయేమో ఓసారిచూడు. పుస్తకాలమధ్య నోట్లు పెట్టే పాడు అలవాటు నాకుంది...వస్తా మరి...మర్చి..."

రిషి అలా కదలడంతోనే నాగావళి గబగబా అతని గదిలోకి వెళ్ళింది. కంగారుగా పుస్తకాలన్నీ తిరగేస్తోంది. రూపాయలు వుండవని ఆమెకు తెలుసు. ఏదో విశేషం వుండాలి. లేకపోతే ప్రత్యేకించి యీ విషయం చెప్పడం ఎందుకు? వ్రేళ్ళు ఆత్రుతగా పేజీల్ని తిప్పుతున్నాయి. గుండెకూడా గబగబా కొట్టుకుని కదిలే వ్రేళ్ళకు తాళం వేస్తోంది. అకస్మాత్తుగా ఆమె చూపులు నిలిచిపోయాయి. ఓ పుస్తకంలో మడత పెట్టిన కాగితం; పైన నాగావళి పేరు!

కొద్దిసెకనులు గుండె కొట్టుకోవడం మానేసి మళ్ళీ ప్రారంభించింది.

ఆత్రతగా కాగితం మడతలు విప్పింది.

'నాగావళీ—

బానిసత్వం ఎరగనివాడ్ని. చిన్నప్పటినుంచీ స్వేచ్ఛగా పెరిగినవాడ్ని. ఎప్పుడూ ఎవరి అదుపాజ్ఞల్లోనూ వుండలేదు. ఎవరి నీడల్లోనూ పెరగలేదు. చాలా స్వతంత్రంగా జీవించాను. ఎదుటివారి ఆధిక్యతని వొప్పుకుంటాను గాని తలవంచలేను. ఇంట్లోకాని, స్కూల్లోకాని ఎప్పుడయినా ఎవరయినా అధికారాన్ని చెలాయించడానికి ప్రయత్నిస్తే పడేవాడిని కాదు. పరిధులు గీసి, ఆ పరిధుల మధ్య నున్న నిలబెట్టడానికి ప్రయత్నించేవాళ్ళంటే నాకు తగని చిరాకు. అధికారంతోగాని, అభిమానంతోగాని ఎవరయినా నన్ను కట్టిపడేయాలని చూస్తున్నట్టు అర్థమైతే మళ్ళీ వారి దగ్గరకు వెళ్ళేవాడిని కాను. అలా నా వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటూ వచ్చాను. దీనిపై యితరుల ప్రభావం పడడం నాకిష్టం లేదు. నాదైన వ్యక్తిత్వం నాకు వుండాలని నా ఆరాటం.

నాగావళీ! నేను అందగాడ్ని కాకపోయినా అందమైన అమ్మాయిని నా జీవితంలోకి తెచ్చుకోవాలని స్వార్థపరుడిగా కలలుగన్నాను. నిన్ను చూసిన తర్వాత ఎన్నో ఊహల్ని అల్లుకున్నాను. అదృష్టవంతుడ్నని మురిసిపోయాను. జీవితాన్ని అడుగడుగునా రసమయం చేసుకోవచ్చని ముచ్చట పడ్డాను. కాని నువ్వు అభిమానంతో కట్టిపడేయాలని చూశావు. ప్రేమతో శాసించడానికి ప్రయత్నించావు. నా వ్యక్తిత్వాన్ని కూడా గౌరవించాలనే విషయాన్ని విస్మరించావు. నే నది సహించలేకపోయాను.

ఇప్పటికీ నీ అందాన్ని మెచ్చుకుంటాను. నీ అభిమానానికి కృతజ్ఞత చెప్పుకుంటాను. ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా బాధపెట్టాను నిన్ను. నువ్వు నా జీవితాన్ని శాసించడానికి ప్రయత్నిస్తున్నావని తెలిసి, కావాలని నీకు బాధ కలిగేటట్టు ప్రవర్తించాను. నన్ను క్షమించు.

ప్రేమతోనైనా శాసింపబడడం ఇష్టం లేదు నాకు.

అందుకే నీ నీడనుంచి తప్పుకుని వెళ్ళిపోతున్నాను. నీకు బాధకలిగించినందుకు మరోసారి క్షమాపణ చెప్పుకుంటున్నాను.

—సదానంద.'

నాగావళికి దుఃఖం ఆగిందికాదు. పెదాల్ని బిగబెట్టి ఎంతగా ఆపుకోవాలని చూసినా సాధ్యంకాలేదు. చెక్కిళ్ళు తడిసిపోయాయి. అరగంటవరకూ ఆ గదిలోంచి బైటికి రాలేకపోయింది. ఆ రోజల్లా తలనొప్పిగా వుందని మంచం లోంచి లేవలేదు.

కూతురి వాలకాన్ని చూసి ఏదో జరిగుంటుందని తల్లీ, తండ్రీ పసిగట్టి అడిగారు గాని ఆమె ఏమీ చెప్పలేదు. 'ఏమీ లేదు ... ఏమీలేదు' అనేసింది. చివరకి

రాఘవరావుగారే అతి లౌక్యంగా సదా నంద తల్లిపేరున వుత్తరం రాశారు. ఇప్పుడు అబ్బాయి చేస్తున్న వుద్యోగం చాలా మంచిది. ఎం. ఏ. చదువులు చదువుకున్నవాళ్లకూడా దానికి ఎగబడు తుంటారు. ఆ ఉద్యోగం మన అదృష్టం కొద్దీ దొరికింది. అబ్బాయి చేరి నెల రోజులన్నా కాలేదు. ఇంటిమీద ధ్యాస పుట్టిందంటే సరే వెళ్ళిరమ్మన్నాను. ఎక్కువరోజులు అక్కడ వుంచక సాధ్యమైనంత త్వరలో అబ్బాయిని పంపించేస్తే మంచిది. అబ్బాయితోపాటు మీరూ రండి; వారంరోజులుండి వెళ్లు దురుగాని. మనవాళ్లు చాలామంది వున్నా రిక్కడ. వీళ్ళందర్నీ చూసినట్టూ అవు తుంది – అని.

ఆ ఉత్తరం సదానందే అందుకున్నాడు. చదువుకుని నవ్వుకున్నాడు. దానితో పాటు కవరుకూడా ఒకటి వచ్చింది. పైన హేండ్ రైటింగ్ కొత్తగావుంది. చించి, వుత్తరం బైటికి తీశాడు. చిన్నదే. అడు గున నాగావళి సంతకంవుంది. చదువు కున్నాడు—

"శ్రీ సదానందగారికి నాగావళి హృదయ పూర్వకంగా నమస్కరించి వ్రాయునది.

మీరు వొదిలిపెట్టి వెళ్ళిన వుత్తరం చూశాను. నేను దురదృష్టవంతురాలిననీ తెలుసుకున్నాను. బాధపడ్డాను. నిజానికి యీ వుత్తరం రాయాలనుకోలేదు. కాని మీ వుత్తరంలోని ఒక విషయానికి

సమాధానంగా యిది రాయక తప్పలేదు.

మీరు మీది అనుకుంటున్న వ్యక్తిత్వం మీదికాదు. అసలు మీకు ఒక వ్యక్తిత్వం అంటూ స్థిరంగా ఏదీలేదు. మరీ మంచి వాళ్ళకూ, అమాయకులకూ ఒక స్థిర మైన వ్యక్తిత్వం అంటూ వుండదు. ఎప్పటికప్పుడు అది మారిపోతూ వుంటుంది. ఎదుటివారిని బాధపెట్టడం యిష్టంలేక తమ అభిరుచుల్ని మార్చు కుంటూపోతుంటారు. దాన్నిబట్టే వ్యక్తి త్వాలుకూడా మారుతూవుంటాయి. అలా మారడం తప్పేమీ కాదు. మీ వ్యక్తి త్వంమీద యితరుల ప్రభావం పడుతుం దని బాధపడిపోవలసిన పనేమీ లేదు.

మొట్టమొదట మీ నీడలోనే నేను వుందామనుకున్నాను. కాని మీమీదనే గొడుగుపట్టాల్సిన అవసరం వుందని తెలుసుకున్నాను. అంతటా సౌందర్యాన్నీ, మంచితనాన్నీ చూసే మీకు ఊహల్లో విహరించడం తప్ప భూమ్మీద నడవడం చేతకాదు. అందువల్ల

ఎప్పుడూ నీడలా అంటిపెట్టుకునే మనిషి అవసరం మీకు.

మిమ్మల్ని శాసించాలన్న అధికార మనస్తత్వంకానీ, కట్టిపడేయాలన్న స్వార్థంకానీ నాకు లేవు.

మీ చుట్టూ ఎన్నో ఆశల్ని అల్లుకున్నాను. కాని మీరు దూరంగా పారిపోయారు. ఏంచేస్తాను—నా అదృష్టం అంతంతమాత్రంగానేవుంది. కాని మీకు నా సలహా ఒకటివుంది. ఎప్పుడైనా మీరు పెళ్ళిచేసుకోదలిస్తే మిమ్మల్ని శాసించగలిగే ఆమెనే పెళ్ళిచేసుకోండి. మీఅంతట మీరు ఏపనీ చెయ్యలేరు. ఎవరో లాలించి, అవసరమైతే కసిరి, కోప్పడి మీచేత ఆపని చేయించాలి. అందువల్ల మీకు మేలేకాని నష్టం కలుగదు —— ఉంటానుమరి

—— నాగావళి."

ఆ ఉత్తరం మళ్ళీ చదువుకున్నాడు. ఇంకొకసారి కూడా చదువుకున్నాడు. సాయంకాలం కోనేరు గట్టుమీద కెళ్ళి చీకటిపడేవరకూ ఆ వుత్తరాన్ని ముందుంచుకునే కూర్చున్నాడు. చివరకు ఆలోచనలన్నిటినీ అదే వుత్తరంలో మడతపెట్టి, జేబులో పెట్టేసుకుని ఇంటికొచ్చి, బేంకువాళ్ళకు వుత్తరం రాశాడు— అర్జంటు పనివల్ల స్వగ్రామం రావలసి వచ్చిందనీ, సెలవు దరఖాస్తు పెట్టడానికి కూడా వ్యవధి లేకపోయిందనీ, అందువల్ల పోస్టులో పంపిస్తున్నాననీ, అయిదు రోజులు సెలవు యిప్పించవలసిందనీ వ్రాసి, ఆరాత్రికిరాత్రే పోస్టు చేశాడు సదానంద.